నేడు కేంద్రమంత్రి జిల్లా పర్యటన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈనెల 19న జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో 11వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు కోటబొమ్మాళి మండలం తాటిపర్తిలో కీ.శే మెండా భాస్కరరావు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి ఏడు గంటల వరకు 80 అడుగుల రోడ్డులోని ప్రజాసదన్‌లో సందర్శకులకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

- 14 మండలాల్లో సాధారణ వర్షపాతం
- తొమ్మిది మండలాల్లో అధిక వర్షం
- జిల్లాలో 2.95 లక్షల ఎకరాల్లో వరి సాగు
- రిజర్వాయర్లలో పెరిగిన నీటి నిల్వలు

ఆశాజనకంగా ఖరీఫ్ సాగు

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంది. జూన్‌లో సాధారణంగా కురవాల్సిన వర్షం కంటే తగ్గినా, జూలైలో కురిసిన వర్షాలతో ఈ సీజన్‌లో సాధారణం కంటే అదనంగా నమోదైంది. ఆగస్టు తొలి 15 రోజుల్లో కొంత వర్షపాతం లోటు కనిపిస్తున్నా, ఖరీఫ్‌కు మరో 15 రోజులు ఉండడంతో వర్షపాతం లోటు నుంచి గట్టెక్కవచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఖరీఫ్‌లో నిర్దేశించిన లక్ష్యం మేరకు పంటల సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు అటు వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం పెరగడంతో రిజర్వాయర్లు, బ్యారేజీల్లో పుష్కలంగా నీటి నిల్వలు కొంతమేర పెరిగాయి. మొత్తమ్మీద ఇప్పటివరకు సాగుకు సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,21,655 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఆగస్టు రెండో వారం నాటికి అన్ని రకాల పంటలు కలిపి 3,19,898 ఎకరాల్లో (76 శాతం) విత్తనాలు వేశారు. వరి పంటను 3,87,323 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా, వరి పంట 2,95,180 ఎకరాల్లో (76 శాతం) సాగవుతున్నట్లుగా నమోదైంది. మొక్కజొన్న పంటను 25,270 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా, ప్రస్తుతం 21,550 (85 శాతం) ఎకరాల్లో వేశారు.

పత్తి పంట సాగు గణనీయంగా పెరిగింది. పత్తి పంటను 3,888 ఎకరాలకు గానూ 2,135 ఎకరాల్లో (57 శాతం) వేశారు. మినప పంట 172.5 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 37.5 ఎకరాల్లో (22 శాతం) వేశారు. పెసర పంట 138 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకోగా 40 ఎకరాల్లో (29 శాతం) వేశారు. కంది పంట సాగు మాత్రం నిరాశాజనకంగా ఉంది. కంది పంటను 230 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు కేవలం 2.5 ఎకరాల్లో (ఒక శాతం), వేరుశనగ పంటను 730 ఎకరాల్లో విత్తనాలు వేయాల్సి ఉండగా 243 ఎకరాల్లో (33 శాతం) వేశారు. గోగు పంట 142.5 ఎకరాలకు గానూ ఐదు ఎకరాల్లో, చెరుకు 3,485 ఎకరాలకు గానూ 603 ఎకరాల్లో వేశారు. ఇప్పటివరకు ఒక్క ఎకరాలోనూ నువ్వుల విత్తనాలు పడలేదు.

ఆ మండలాల్లో వరి సాగు బాగు

జిల్లాలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురిసిన మండలాల్లో సాగు పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. సరుబుజ్జిలి మండలంలో లక్ష్యానికి మించి వరి సాగవుతున్నట్లు నమోదైంది. ఇక్కడ 12,845 ఎకరాల్లో వరి వేయాలని లక్ష్యంగా నిర్ణయించడగా 13,228 ఎకరాల్లో (103 శాతం) వేశారు. పాతపట్నం మండలంలో 17,120 ఎకరాల్లో వరి వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా, ఇప్పటివరకు 15,638 ఎకరాల్లో (92 శాతం) వేశారు. నరసన్నపేటలో 18,740 ఎకరాలకు గానూ 14,125 ఎకరాల్లో (92 శాతం) వరి విత్తనాలు వేశారు. బూర్జ మండలంలో 12,303 ఎకరాల్లో వరి సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 10,950 ఎకరాల్లో (89 శాతం) సాగు అయింది. కొత్తూరులో 14,318 ఎకరాలకు గానూ 11,538 ఎకరాల్లో (81 శాతం) సాగు నమోదైంది. ఎల్ఎన్‌పేటలో 10,738 ఎకరాలకు గానూ 8,475 ఎకరాల్లో (79 శాతం) వరి సాగు అయింది.

ఖరీఫ్‌లో సాధారణ వర్షపాతం నమోదు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు 413.2 మి.మీ వర్షం పడాల్సి ఉండగా 415.6 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలోని 30 మండలాలకు గానూ తొమ్మిది మండలాల్లో అధిక వర్షం కురిసింది. 14 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఏడు మండలాల్లో ఇంకా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్‌లో సాధారణంగా 134.9 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 128.9 మి.మీ వర్షం కురిసింది. జూలైలో 164 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 204.9 మి.మీ వర్షం పడింది. ఆగస్టు ఒకటి నుంచి ఇప్పటివరకు సాధారణంగా 181.9 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా, 93.9 మి.మీ వర్షం కురిసింది.

రిజర్వాయర్లలో పెరిగిన నీటి నిల్వలు

జూలైలో విస్తారంగా వర్షాలు కురవడంతో పాటు అటు ఒడిశాలోనూ వానలు పడుతుండడంతో వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో రిజర్వాయర్లు, బ్యారేజీల్లో నీటి నిల్వలు పెరిగాయి. హిరమండలం వద్ద ఉన్న గొట్టాబ్యారేజి కెపాసిటీ 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం అంతే పరిమాణంలో నీరు లభ్యమవుతోంది. మడ్డువలస రిజర్వాయరు సామర్థ్యం 3.37 టిఎంసిలు కాగా, ఈనెల ఒకటో తేదీ వరకు 2.39 టిఎంసిల నీరు మాత్రమే లభ్యమవుతోంది. తోటపల్లి రిజర్వాయర్ 2.50 టిఎంసిల నీరు లభ్యం కావాల్సి ఉండగా, ప్రస్తుతం 2.14 టిఎంసిల నీరు ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

తప్పు చేస్తే సహించేది లేదు

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

విధి నిర్వహణలో అధికారులు ఎటువంటి తప్పులకు పాల్పడినా సహించేది లేదని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని, లేకుంటే బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కిల్లి రమాదేవి అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.వి.ఎస్ ప్రసాదరావు నివేదిక చదివిన అనంతరం శాఖల వారీగా చర్చ చేపట్టగా, పలు శాఖలపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. సింధువాడ గ్రామ సచివాలయ పరిధిలో రైతులు ఎరువుల కోసం డబ్బులు కట్టి 45 రోజులు ఎదురుచూస్తున్నా, నేటికీ రాలేదని సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు ప్రస్తావించారు. తురకపేటలో అరవల పార్వతి అనే మహిళకి భర్త ఉండగా వితంతు పెన్షన్ ఇస్తున్నారని సర్పంచ్ ఆధారాలతో సహా అధికారులను నిలదీశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వం పలువురు డీలర్లను కేసుల్లో ఇరికించి సీజ్ చేసిన బియ్యం బస్తాలు ఏమయ్యాయని షళంత్రి ఎంపిటిసి శివ్వాల సూర్యనారాయణ సిఎస్‌డిటిని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే మండలంలో గత ఐదేళ్లలో రేషన్ డీలర్లపై నమోదైన కేసులు వివరాలు, సీజ్ చేసిన సరుకుల వివరాల సమగ్ర నివేదికలతో తన వద్ద హాజరు కావాలని ఆదేశించారు.

చిగురువలసలో ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించి వ్యక్తిగత నిర్మాణాలు చేపడుతున్నా పంచాయతీ, విద్య, రెవెన్యూ అధికారులు కనీసం స్పందించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే నిర్మాణదారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్‌టిఆర్ గృహాలకు గత ప్రభుత్వం నిలుపుదల చేసిన బిల్లులు చెల్లిస్తున్నందున, వాటిని సర్వే చేసి నివేదికను అందించాలని హౌసింగ్ ఎఇ లక్ష్మీనారాయణకు సూచించారు. మండలంలో నకిలీ ఆధార్, నకిలీ వికలాంగుల సర్టిఫికెట్లతో సామాజిక పెన్షన్లు పొందుతున్న వారిని గుర్తించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపిపిలు గోవిందు వెంకట శివానందమూర్తి, లావేటి అనిల్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలిసుండే ప్రసక్తే లేదు

- న్యాయస్థానమే తేల్చుతుంది
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

సమాజంలో తన పరువు, ప్రతిష్టను దెబ్బతీసిన తర్వాత తన భార్య వాణితో ఇక కలిసుండే ప్రసక్తే లేదని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన 30 ఏళ్ల వైవాహిక జీవితంలో రాజకీయాల కారణంగా తన భార్యతో నిత్యం గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ 30 ఏళ్లూ నరకం అనుభవించానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఓటమి చెందడానికి ప్రధాన కారణం తన భార్య వాణి అని అన్నారు. మొన్నటి ఎన్నికల ముందు గొడవ పెట్టి మరీ ఆస్తులు తీసుకున్నారని చెప్పారు. రెండేళ్లుగా తాము వేర్వేరుగా ఉంటున్నామని, అప్పుడు అక్కర్లేని భర్త ఈరోజు కావాలా అని ప్రశ్నించారు. ఈ రెండేళ్లు ఎక్కడ ఉన్నావు, ఏం చేస్తున్నావని ఒక్కరోజైనా వాణి గానీ, తమ పిల్లలు గానీ ఎందుకు అడగలేదన్నారు. తలుపు తాళం వేసి బయటకు పంపించి విడాకులు కావాలని చెప్పి, తనను అప్రతిష్టపాల్జేసి ప్రజల్లో చులకన కావడం వల్ల ఇప్పుడు తాను కావాలని వాణి అంటోందని చెప్పారు. తనకున్న సుమారు రూ.30 కోట్ల ఆస్తుల్లో రూ.27 కోట్ల ఆస్తులను వాణికి, పిల్లలకు ఇచ్చేస్తున్నానని చెప్పారు. తనకున్న రూ.మూడు కోట్లలో కొత్త ఇళ్లు కట్టుకున్నానని తెలిపారు. తాను టెక్కలిలో ఉంటే ఆమె రాజకీయ మనుగడకు ఇబ్బందని, తనను టెక్కలి నుంచి వెళ్లగొట్టేందుకు ఈ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. తన ఇంటి వద్ద దీక్ష చేస్తున్న వాణి దాన్ని విరమిస్తే మంచిదన్నారు. విడాకుల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, తుది తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలన్నారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం రావాలి

శ్రీకాకుళం అర్బన్ : సమాజంలో పెరుగుతున్న మూఢనమ్మకాలు మూఢవిశ్వాసాలు అశాస్త్రీయ భావనలతో ప్రజాస్వామ్యం లౌకికతత్వం దాడికి గురవుతున్నాయని, వీటి సంరక్షణకు ప్రత్యేక చట్టం రావాల్సిన అవసరం ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ఒక ప్రకటనలో అన్నారు. మూఢనమ్మకాలను దూరం చేసి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడూ నినదించాలని పిలుపునిచ్చారు. సైన్స్ ఉద్యమ ఆందోళనల ఫలితంగా కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో మూఢనమ్మకాల నిరోధక చట్టం అమలులో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ చట్టం రావాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా హేతువాద సంఘాలు, ప్రజా సైన్స్ సంఘాలు అభ్యుదయ సంఘాలు, నాస్తిక సంఘాలు, మేధావులు ఐక్యంగా మూఢనమ్మకాల నిరోధక చట్టం సాధన కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ శాస్త్రీయ దృక్పథం దినం (నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే) ప్రముఖ శాస్త్రీయ దృక్పథ వాది డాక్టర్ నరేంద్ర దబోల్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 20న నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మూఢనమ్మకాల నిరోధక చట్టం సాధన కమిటీ ఏర్పాటుకు సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.

బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి పెంచుకోవాలి

అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు

మాట్లాడుతున్న దేవభూషణరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడల్లో రాణించేందుకు యువత శ్రమించాలని, అందులో భాగంగా జిల్లాలోనూ బాడీబిల్డింగ్‌పై ఆసక్తి పెంచుకుని స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించాలని ది ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న వీ-1 కన్వెన్షన్‌లో ది ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా చీఫ్ ప్యాట్రన్ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో డాక్టర్ బాడాన దేవభూషణరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాడీబిల్డింగ్‌పై ప్రజల్లో తీవ్రమైన అపోహలు ఉన్నాయని, వాటి విడనాడాలని అన్నారు. బాడీబిల్డర్లు తసుకునే ప్రోటీన్ ఆహారంలో వే ప్రోటీన్, సోయా ప్రోటీన్ మాత్రమే వినియోగిస్తారని అన్నారు. వీటివల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని చెప్పారు. ఈ ప్రోటీన్ ద్వారా లావుగా పెరగడానికి, తగ్గడానికి ఉపయోగపడుతుందన్నారు. అసోసియేషన్ స్టరైడ్స్, డ్రగ్స్‌కు పూర్తిగా విరుద్ధమని వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. వ్యవస్థలపై మంచి అవగాహన వ్యక్తి డాక్టర్ బాడాన దేవభూషణరావును జిల్లా చీఫ్ ప్యాట్రన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా అసోసియేషన్ ఏర్పాటుకు క్రీడాకారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కొయ్యాన గౌరీశంకర్, అరుగుల సంతోష్, బట్న నవీన్, ఎన్.భాస్కరరావు, ఆర్.గణేష్, బి.నాని, బి.అరవింద్, కె.లక్ష్మణ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటన దేశ ప్రతిష్టకు భంగం వాటిల్లేదిగా ఉందని, పనిచేసే చోట మహిళలకు కనీస భద్రత కరువైందని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలికలు, మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినా, అమల్లో ప్రభుత్వాల ఉదాసీన వైఖరి వల్ల చట్టాలు నీరుగారుతు న్నాయని విమర్శించారు. కోవిడ్ వారియర్స్ అని కీర్తించి, సత్కారాలు చేసిన వైద్యులకు ఆస్పత్రుల్లో ఇప్పుడు భద్రత ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న ప్రదేశాల్లో అభద్రతాభావంతో పనిచేస్తున్నారన్నారు. మహిళా ఉద్యోగులు రాత్రిపూట విధులు నిర్వహించే ప్రదేశంలో విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక అమరిక కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పనిచేసే ప్రాంతాల్లో, లిఫ్ట్‌ల్లో సిసి కెమెరాలు తప్పనిసరిగా అమర్చాలని సూచించారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలుపై ప్రభుత్వం మరింత శ్రద్ధ చూపాలని కోరారు. మహిళలు పనిచేసే ప్రతిచోట ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ, లోకల్ కంప్లైంట్ కమిటీలు ఏర్పాటు చేసి డ్యాష్ బోర్డు నిర్వహించాలన్న సుప్రీంకోర్టు తీర్పును కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కలకాలం రక్షగా...

నేడు రక్షా బంధన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం, కోటబొమ్మాళి

ఎన్నాళ్లయినా, ఎన్నేళ్లయినా..
ఇగిరిపోని గంధం..
వసివాడని బంధం..
అన్నా చెల్లెళ్ల అనుబంధం...

వెలకట్టలేని బంధాలు, వదులుకోలేని అనుబంధాలను గుర్తు చేసే మధుర బంధమే రాఖీ పండగ.

ఇలా ఎన్ని కవితలు చెప్పినా, పాటలు పాడినా దాని అర్థం ఒక్కటే అన్నాచెల్లెళ్ల అనుబంధం. రాఖీ పండగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిర్వహిస్తుంటారు. ఈ పండగను కుల, మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ జరుపుకుంటారు. కష్టసుఖాల్లో తోడుంటానని, అన్నివేళలా బాసటగా నిలుస్తానని అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ములు అభయమిచ్చే పండగే రాఖీ పౌర్ణమి. ఈ పండగను సోమవారం ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఏడాదిలో ఓ రోజు అన్నదమ్ములను గుర్తు చేసుకోవడం చెల్లెమ్మలకు ఆనవాయితీ. మనుషుల మధ్య అంతరాలు పెరుగుతున్న నేటి తరుణంలో ఇలాంటి పండగలను అందరూ స్వాగతించాల్సిందే. అక్కాచెల్లెళ్లకు అన్నదమ్ముల తోడు ఏడాదిలో ఒకరోజు ఉండాల్సింది కాదు, జీవితాంతం ఉండాలి. వారికి అన్నివిధాలుగా సహాయపడాలి. జిల్లాలో ఈ పండగను అందరూ చేసుకుంటున్నా మార్వాడీలకు ప్రధానమైనది. వీరు రాఖీ పౌర్ణమికి ఎంతో ప్రాధాన్యతనిస్తారు. ఈ పండగకు ధనిక, పేద తారతమ్యం లేదు. దూరప్రాంతాల్లో ఉన్న మహిళలు

తమ సోదరులకు పోస్టు ద్వారా రాఖీలను పంపుతారు. విదేశాల్లో ఉన్న వారు వాట్సాప్‌లు, ఎస్ఎంఎస్‌లు, వీడియో కాలింగ్ ద్వారా రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తారు. అన్నదమ్ములు పది కాలాల పాటు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని తోబుట్టువు రాఖీ కడుతుంది. ఆ విశ్వాసంతోనే రాఖీ పౌర్ణమి రోజున అన్నదమ్ముల వద్దకు అక్కాచెల్లెళ్లు వెళ్తారు.

ఆకాశాన్నంటిన రాఖీల ధరలు

శ్రీకాకుళం నగరంలోని అన్ని కూడళ్లలో రాఖీలను విక్రయిస్తున్నారు. జిల్లాలోని ప్రతిచోటా రాఖీను అమ్మే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కేవలం పట్టణాలకే కాకుండా పల్లెల్లోని చిన్న చిన్న కిరాణా దుకాణాల్లోనూ వీటిని విక్రయించారు. అన్ని ధరలతో పాటు రాఖీ ధరలు కూడా పెరిగాయి. రూ.పది మొదలుకుని రూ.500 విలువ చేసే రాఖీలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. గతేడాది రూ.పది ఉండే రాఖీ ఈ ఏడాది రూ.20 పలుకుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వీటి ధరలు 50 శాతం పెరిగాయి. కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి రాఖీలను రప్పించి విక్రయిస్తున్నారు. స్వీట్ షాపులు జనాలతో కిటకిటలాడుతున్నాయి. రాఖీ పండగ రోజు సోదరి సోదరునికి రాఖీ కట్టి మిఠాయి తినిపించడం ఆనవాయితీ. దీంతో స్వీట్ షాపులన్నీ కిక్కిరిశాయి.

గి'రాఖీ'

అన్నాచెల్లెళ్ల అనురాగానికి, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ఈ నెల 19న జరగనుంది. దీంతో రాఖీల అమ్మకాలు, కొనుగోళ్లతో టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మార్కెట్లో రాఖీల విక్రయ సెంటర్లు భారీగా వెలిశాయి. రాఖీల అమ్మకాలు, కొనుగోళ్లతో మండల కేంద్రాల్లో సందడి నెలకొంది. వ్యాపారులు గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి వివిధ రకాల రాఖీలను తీసుకొచ్చి హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. చిరు వ్యాపారులు తోపుడు బండ్లు, కాలనీల్లోని కిరాణా, జనరల్ స్టోర్స్‌లో వీటిని అమ్ముతున్నారు. దీంతో రాఖీలకు గిరాకీ పెరిగింది. కోటబొమ్మాళిలోని రైతుబజారు దగ్గర, బ్లూవన్ సెంటర్ తదితర ప్రాంతాల్లో రాఖీల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు తోపుడు బల్లపై ఏర్పాటు చేసుకోగా, మార్కెట్‌లో వ్యాపారాలు చేసేవారు సైతం రాఖీలను ప్రత్యేకంగా తెప్పించి విక్రయిస్తున్నారు. రాఖీలు రూ.10 నుంచి రూ.300 వరకు ధర పలుకుతున్నాయి. నాలుగు రోజులు వరుస సెలవులు రావటంతో ఇప్పటికే రాఖీలు కొనుగోలు చేసి పుట్టినిల్లుకు చేరుకున్నారు.

అందుబాటులో 'పిఎం సూర్యఘర్'

- విద్యుత్ కోతల నియంత్రణే ధ్యేయం
- ఉత్పాదకతకు ప్రత్యామ్నాయం సోలార్
- సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు
- అందుబాటులో 1912 టోల్ ఫ్రీ నంబరు
- ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ అవసరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, బొగ్గు, సాగునీటి ప్రాజెక్టులు, విండ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నామని విద్యుత్ తూర్పు పంపిణీ సంస్థ (ఇపిడిసిఎల్) ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ఇక నుంచి ప్రత్యామ్నాయంగా ప్రతి వినియోగదారుడూ తన అవసరాలకు వీలుగా ఇంటివద్దే విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని వాడుకోవచ్చని అన్నారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడగుగుల వేస్తున్నాయని అన్నారు. వినియోగదారులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ గూగుల్ ప్లే స్టోర్ ద్వారా మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ యాప్ ద్వారా పిఎం సూర్యఘర్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? సూర్యఘర్‌కు దరఖాస్తు ఎలా చేసుకోవాలి?

విద్యుత్ వినియోగదారునిగా ఇపిడిసిఎల్ పరిధిలో విద్యుత్ వినియోగిస్తున్న లబ్ధిదారుడు సూర్యఘర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు లబ్ధిదారులు రిజిస్ట్రేషన్, పూర్తి పేమెంట్ సబ్సిడీ వివరాలు యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు కిలో వాట్స్, సబ్సిడీ, బ్యాంకు రుణం వివరాలు యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న తర్వాత పీజుబుల్టీని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్లు వినియోగదారులతో ఒప్పందం



కుదుర్చుకుని సోలార్ ప్యానల్ అమరుస్తారు. ఇంటివద్ద ఉత్పత్తయ్యే సోలారు విద్యుత్‌ను వినియోగదారులు తమ అవసరాలకు వాడుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించుకోవచ్చున్నారు.

? సూర్యఘర్‌పై ప్రజల్లో ఆసక్తి ఎలా ఉంది?

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద ఇప్పటి 147 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 37 మందికి సోలారు యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ పథకం వల్ల ఉత్పత్తికి పెంచుకునేందుకు వీలుంది. జిల్లాలో 8 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వారిని ప్రోత్సహించడంలో భాగంగా అర్హులైన రెండు లక్షల కుటుంబాలకు ఈ పథకాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు కోరింది. అయినా ఇంత వరకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

? విద్యుత్ అంతరాయాన్ని ఎలా అధిగమిస్తారు?

ప్రస్తుతం విద్యుత్ అంతరాయం కలగకుండా ఉద్యోగులు శ్రమిస్తున్నారు. అందుకే టోల్ ఫ్రీ నంబరు 1912ను అందుబాటులోకి తీసుకొచ్చాం. భవన నిర్మాణాల సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా దోహదపడతాయన్నారు. వ్యవసాయానికి ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతరంగా తొమ్మిది గంటలు సరఫరా చేస్తున్నాం. పంట పొలాల్లో, సముద్రతీర ప్రాంత గ్రామాల్లో వేలాడే విద్యుత్ తీగల మరమ్మతులు, పాడైన స్తంభాలు డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ ద్వారా మారుస్తున్నాం. జిల్లాలో ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పొందడానికి సముద్రతీరంలో గ్రామాలను రెండు ఫైజ్‌ల్లో అండర్ గ్రౌండ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.

? ప్రభుత్వ శాఖల్లో సోలార్ వినియోగం ఎలా సాధ్యమవుతోంది?

ప్రభుత్వ శాఖల పరిధిలో విద్యుత్ బకాయిలను దృష్టిలో ఉంచుకుని సోలార్ ఉత్పత్తికి ప్రత్యేక పథకాన్ని ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమీకరిస్తోంది. పవర్‌గ్రిడ్‌ల మెంటినెన్సు, విద్యుత్ లైన్ల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాం. అనుమతులు రాగానే జిల్లాలోని 611 ప్రభుత్వ కార్యాలయాల్లో సోలాలర్ ప్యానల్స్ మొదటి విడతలో అమర్చాలని భావిస్తున్నాం. కౌసల స్కీం ద్వారా వీటి మార్పు చేస్తున్నాం.

? విద్యుత్ కోతల నియంత్రణ ఇప్పట్లో సాధ్యమేనా?

రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమైన విద్యుత్‌ను ఇప్పుడు నాణ్యమైన రీతిలో అందిస్తున్నాం. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతోంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం మార్పు రావడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కొనసాగుతోంది. ఈ సమయంలో పంపు సెట్లు, బోర్లు మరమ్మతుకు గురైతే రైతులకు తీరని నష్టం జరుగుతుంది. అందువల్ల విద్యుత్ కోతలు అత్యవసర పరిస్థితుల్లో మినహా మిగిలిన సమయాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతుంది.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్ని ఆస్పత్రులు వచ్చినా క్షేత్రస్థాయిలో రోగులను గుర్తించి వారికి సేవలందించే వారికి ప్రజల్లో నమ్మకం ఉంటుందని లైఫ్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. గార మండలం అంపోలు జిల్లా పరిషత్ పాఠశాలలో లైఫ్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు గొండు లోకేష్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, సరైన నిద్ర లేకపోవడంతో చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్నారన్నారు. అనారోగ్యం ఎదురైన తర్వాత వెంటనే వైద్యులను సంప్రదిస్తే త్వరగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు నష్ట పోతారన్నారు. కార్యక్రమంలో గొండు వెంకట రమణమూర్తి, గొండు అచ్యుతరావు, గ్రామ పెద్దలు, ప్రజలు, లైఫ్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగీ అంకిత భావం, నిబద్ధతతో పనిచేస్తే అందరి మన్ననలు పొందగలరని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెద్ద బాబూరావు అన్నారు. మండలంలోని పెద్దమడి ఎపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ రేణుకేశ్వరరావు పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా సన్మాన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేణుకేశ్వరరావు వివాదారహితునిగా అందరి మెప్పు పొందారని కొనియాడారు. అనంతరం రేణుకేశ్వరరావు దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించి మెమెంటో, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సాసుమాన చంద్రమౌళి, కొరికాన శంకరరావు, పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీలు చేస్తున్న సందీప్ కుమార్

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ వి.సందీప్ కుమార్ హెచ్చరించారు. నగరంలో 80 అడుగుల రహదారిలో ఆదివారం ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, సిబుక్, గతంలో ఎక్కడైనా అపరాధ రుసుం బకాయిలు ఉన్నట్లయితే వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ట్రిబుల్, డబుల్ డ్రైవింగ్‌లో వాహనాలు నడుపుతున్న యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతివేగం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఇటువంటి వాటిపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

చీపుర్లపాడులో పండిస్తున్న మొక్కజొన్న పంట

మొక్కజొన్న సాగుపై మొగ్గు

కోటబొమ్మాళి: ఈ ఏడాది మండలంలో రైతులకు మొక్కజొన్న పంట సిరులు కురిపిస్తుంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో గాను రైతులు తమ మెట్ట పంట భూముల్లో జూన్ మొదట వారంలో వర్షం పడగానే రైతులు తదుపరి ఈ మొక్కజొన్న విత్తనాలు నాటి అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ పంట ఆరుతడి పంట కావడం, ఎరువులు, వ్యవసాయ మదుపులు తక్కువ కావడంతో రైతులు ఈ పంటపై మొగ్గుచూపారు. మండలంలోని చీపుర్లపాడు, సౌడాం, చలమయ్యపేట, శ్రీజగన్నాథపురం, ఎత్తురాళ్లపాడు, గంగారం, తిలారు, నిమ్మాడ, కోటబొమ్మాళి, కురుడు, దంత, కొత్తపల్లి, చౌదరికొత్తూరు తదితర గ్రామాల్లో ఈ మొక్కజొన్న పంటను విస్తారంగా పండిస్తున్నారు. ఈ మొక్కజొన్నలో కూడా మూడు రకాలున్నాయి. ఒక రకం మొక్కజొన్నలు కాల్చుకుని తినడానికి, కోళ్లు, పశువుల దాణాలకు ఉపయోగపడుతుండగా, మరో రకం మొక్కజొన్న స్వీట్ కార్న్‌గా పిలవబడుతుంది. ఈ స్వీట్ కార్న్ కిలో రూ.30 నుంచి రూ.50 ధర పలుకుతుంది. ఈ స్వీట్ కార్న్‌ను ఎక్కువగా వివాహాల కూరలో వినియోగిస్తున్నారు. ఇంకోక రకం బేబీ కార్న్ ఉంది. దీనిని కూడా బిరియానీలో, కూరలలో వినియోగిస్తున్నారు. ప్రస్తుత పంటల్లో రైతులకు తక్కువ మదుపుతో ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టేది మొక్కజొన్న కావడంతో ఈ పంటపై రైతులు ఎక్కువ శ్రద్ధ కనబరుస్తున్నారు.

తరలిపోతున్న ఇసుక

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

నది నుంచి ట్రాక్టర్‌తో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు గుప్పిస్తున్న అధికార యంత్రాంగం నేడు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. నాగావళి నదీతీర గ్రామమైన అల్లెనలో అక్రమార్కులు ఇసుకను నది నుంచి డంపింగ్ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నది నుంచి తీసుకొచ్చిన ఇసుకను అగ్రహారంలోని అసిరమ్మ తల్లి గుడి దగ్గర డంపింగ్ చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అయితే ఇసుక అక్రమ రవాణాలను అరికట్టేందుకు ఇటీవల రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షించేందుకు విఆర్ఒ, గ్రామ మహిళా పోలీస్, విఆర్ఎ తదితర శాఖల నుంచి సిబ్బందిని నియమించారు. అయితే యధావిధిగా ఇసుక అక్రమ రవాణా అవుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసిరమ్మ తల్లి గుడి సమీపాన అనధికారికంగా డంపింగ్ చేసిన ఇసుక

అరసవల్లికి రూ.3.76 లక్షల ఆదాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో పెరిగిన సందర్శకుల రద్దీతో ఆదివారం ఒక్క రోజు రూ.3.76 లక్షల ఆదాయం సమకూరింది. టికెట్లు విక్రయాల ద్వారా రూ.1,22,900, విరాళాల రూపంలో రూ.1,16,600, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,36,685 ఆదాయం సమకూరినట్టు ఇఒ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే శంకర్

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మనిషి ప్రాణాలను నిలిపే రక్తం ప్రాణాపాయ స్థితిలో అందక చనిపోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని, అటువంటి పరిస్థితిలో ఉన్న వారితో తమకు బంధుత్వాలు లేకున్నా తమ రక్తాన్ని పంచి తమదైన రీతిలో సమాజానికి సేవ చేస్తున్న వారే రక్తదాతలని వారు ప్రాణదాతలతో సమానమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి జిల్లా యువత ఆధ్వర్యంలో ఎన్‌జిఒ హోంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తైక్వాండో శ్రీను, గౌతం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అడ్డూరిపేట గిరిజన గ్రామంలో ఆదివారం ఆదివాసి సంక్షేమ పరిషత్ సమావేశం నిర్వహించినట్లు ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి తెలిపారు. మండలంలో 12 గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. బూర్జతో పాటు ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలాల ఆదివాసి సంక్షేమ పరిషత్ నూతన కార్యవర్గం ఎంపిక చేపట్టామన్నారు. ఆదివాసీలు ఒక్క సీతంపేటలోనే కాదని అన్ని మండలాల్లో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా సవర శోభన్, ఉపాధ్యక్షులుగా సవర కృష్ణ, కార్యదర్శిగా బాడంగి సురేష్, సహాయక కార్యదర్శిగా సవర ధర్మారావు, కోశాధికారిగా సవర సింహాచలం, సహాయక కోశాధికారిగా సవర లక్ష్మణ్, మండల మహిళా అధ్యక్షులుగా కొండగొర్రి తేజవతి, మండల సలహాదారులుగా సవర కుర్మయ్య ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గురాన అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా...

ప్రజాశక్తి- కవిటి

కవిటి ప్రభుత్వా స్పత్రి వెనుక వైపు ఉన్న 100 కెవి ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదం అంచున ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న దిమ్మ పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. దీనిపై మండల విద్యుత్ అధికా రులకు స్థానికులు గతంలో చాలాసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ ముక్కలు, ముక్కలుగా ఊడిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో నివసిస్తున్న స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేదంటే ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూలేందుకు సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ

గుంతలు పూడ్చేందుకు చర్యలు

ఎమ్మెల్యే కూన రవికుమార్

సరుబుజ్జిలి: మండలంలోని అలికాం - బత్తిలి ప్రధాన రహదారి గుంతలను మొబైల్ వీడియో ద్వారా రోడ్లు భవనాల శాఖ డిఇకి ఎమ్మెల్యే కూన రవికుమార్ చూపించారు. ఆదివారం సర్వసభ్య సమావేశానికి హాజరైన రవికుమార్ సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ నుంచి ఆర్‌టిసి బస్‌స్టేషన్ వరకు ఉన్న గుంతలను పరిశీలించి సంబంధిత అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌టిసి బస్‌స్టేషన్ వద్ద భారీ గుంత ఏర్పడి ఇటీవల పలు వాహనాలు కూరుకుపోతున్న విషయం పాఠకులకు విదితమే. వాటిని తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన సంబంధిత అధికారులు నాసిరకమైన గ్రావెల్ వేసి దిబ్బగా ఏర్పాటు చేయడంతో ఆ రహదారిలో పూర్తిగా వాహనాలు రాకపోకలు నిలిపి వేయటానికి స్థానికులు ఎర్రజెండాలను ఏర్పాటు చేసారు. దీనిని చూసిన ఎమ్మెల్యే కారు దిగి ఆ ప్రాంతానికి చేరుకొని రోడ్లు భవనాల శాఖ డిఇతో ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ విధంగా ఎవరైనా మరమ్మతులు చేపడతారా ఉద్యోగాలు ఇలాగే నిర్వహిస్తారా అంటూ తన మొబైల్ వీడియో కాల్ ద్వారా అక్కడ ఉన్న రోడ్డు స్థితిగతులను డిఇకి ఎమ్మెల్యే ఫోన్‌లో చూపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్షణమే రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా గ్రావెల్ మెటల్ క్రసరా పౌడర్‌తో మరమ్మతులు చేపట్టాలని, గుంతల్లో వేసిన నాసిరకం గ్రావెల్‌ను తక్షణమే అక్కడి నుంచి తొలగించి తాత్కాలికంగా నాణ్యమైన మెటీరియల్‌తో గుంతలు పూడ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్ఐ బి.నిహార్‌ను పర్యవేక్షించాలని ఎమ్మెల్యే రవికుమార్ సూచించారు.

ఫోన్‌లో గుంతలను వీడియో తీస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ధాన్యంతో జీవనం ఆనందమయం

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మనసును ఆధీనంలో ఉంచడం ద్వారా జీవితాన్ని ఆనందమయం చేసుకోవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధి బిందు మాధవి ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర శాఖాహార సద్భావన ర్యాలీని ఆదివారం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. బుద్ధితో జీవనం కొనసాగించడమే ధ్యానమని, సహజసిద్ధమైన యోగా చేసుకోవచ్చన్నారు. పిరమిడ్ ధ్యానం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు. తాను ప్రతిరోజూ ధ్యానం, ప్రాణయామం, సుదర్శనక్రియ చేస్తానన్నారు. దీనివలన చెడు ఆలోచనలకు స్వస్తి పలకవచ్చన్నారు. శాకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షులు రాయ్ జగపతిరాజు, బిందు మాధవి, పిఎంసి డైరెక్టర్ సిద్ధా నాగేశ్వరరావు, ఇస్కాన్ ప్రభు శ్రీనివాస్, బాలాజీరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ సంఘ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

గెస్ట్ ఫ్యాకల్టీ సంఘం జిల్లా అధ్యక్షునిగా చల్లా జగ్గారావు, కార్యదర్శిగా బడ్డ గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం గెస్ట్ ఫ్యాకల్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పదేళ్లుగా రూ.పది వేలుతో చాలీచాలని జీతాలతో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నామని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో అన్ని వ్యవస్థలకు జీతాలు పెంచి ఒక గెస్ట్ ఫ్యాకల్టీలకు మాత్రమే రాజకీయ రంగు పులిమి పట్టించుకోలేదని అన్నారు. దశాబ్దపు కాలంగా జీతాల పెంపునకు నోచుకోని ఏకైక వ్యవస్థ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ అని వాపోయారు. ఇప్పటికైనా టిడిపి కూటమి ప్రభుత్వం గెస్ట్ ఫ్యాకల్టీలకు కనీసం రూ.37 వేలు ఇవ్వాలని కోరారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ సంఘ ఉపాధ్యక్షులుగా చెక్క రవికుమార్, కోశాధికారిగా చెక్క వసంతరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా కాకుర్తి నరసింహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సంఘ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఎన్నికైన నూతన సంఘ సభ్యులు

సాంస్కృతిక కళా సేవా సంస్థ అధ్యక్షునిగా జానకిరాంరెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జానకిరాంరెడ్డి

సాంస్కృతిక కళా సేవా సంస్థ అధ్యక్షునిగా జానకిరాంరెడ్డి ఎన్నిక్యారు. మండలంలోని ఈదుపురం సత్యసాయి ఆలయ ప్రాంగణంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, ఒడిశా ప్రాంతాలకు సంబంధించి కళాకారులు, కళాభిమానులు, కళా ప్రోత్సాహితులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల, కళాసేవ, కళాభివృద్ధి దృశ్య శ్రీమహతి సాంస్కృతిక కళా సేవా సంస్థను నూతనంగా ఏర్పాటు చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా రంగాల జానకిరామ్‌రెడ్డి, కార్యవర్గ గౌరవాధ్యక్షులుగా గొనప లక్ష్మణ్‌మూర్తి, ఉపాధ్యక్షులుగా జీరు మోహనరావు, నర్తు గంగయ్య మాస్టర్, ప్రధాన కార్యదర్శిగా తిప్పన ధనుంజయరెడ్డి, ప్రచార కార్యదర్శిగా చలపరాయి వినోద్‌కుమార్, ఉప కార్యదర్శులుగా కారింగి తులసయ్య, కోశాధికారిగా కొప్పల హేమంత్, ఉప కోశాధికారిగా కారింగి త్రినాథ్‌రెడ్డి, ప్రధాన సలహాదారునిగా కాతిల నరసింహ మూర్తిరెడ్డి, సలహాదారులుగా పొందల కృష్ణారావు, బాగా జయప్రద మాస్టారు, తిప్పన దాలయ్య, బొర్ర హరికుమార్, న్యాయ సలహాదారులుగా ఎన్ని దేవరాజు, బత్తుల నీలకంఠం, మీడియా సలహాదారులుగా మద్దెల కేశవరావు, కరగాన లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు.

ఫ్లెక్సీతో పేరును మూసివేస్తున్న సిబ్బంది

కెజిబివిలో చెరగని జగనన్న అమ్మఒడి

ఆమదాలవలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు జరిగి మూడు నెలలు కావస్తున్నప్పటికీ మండలంలోని తాళ్లవలస కెజిబివి పాఠశాల గోడపై జగనన్న అమ్మఒడి ప్రకటనను మాత్రం అలాగే ఉంచడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సిఎంగా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రిగా లోకేష్ ప్రమాణ స్వీకారం చేసి విద్యా వ్యవస్థలో ఎన్నో ప్రణాళికలు రూపొందిస్తున్నప్పటికీ ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై పలువురు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఆ పాఠశాలలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరవుతున్న సమయంలో ముందుగా అక్కడకు చేరుకున్న టిడిపి కార్యకర్తలు అమ్మఒడి ప్రకటన గోడపై ఉండడంపై అభ్యంతర వ్యక్తం చేస్తూ పాఠశాల సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అప్రమత్తమైన పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వస్తున్నారని చూస్తే అక్షింతలు తప్పదన్న భావనతో జగనన్న అమ్మఒడి పెయింటింగ్‌పై తాత్కాలికంగా గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస్ రామానుజ ఫ్లెక్సీని అతికించి మూసి వేశారు. తల్లికి వందనంగా అమ్మఒడి నామకరణం చేసుకున్నప్పటికీ విద్యార్థులకు విద్యాబోధనలు సమాజ సంస్కరణలు తెలియజేస్తూ నూతన అధ్యయనాలను పాఠాలుగా చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఇటువంటి తప్పిదాలు చేయటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రోడ్లకు మోక్షమెప్పుడో?

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మండలంలోని గ్రామీణ రహదారులకు మోక్షమెప్పుడని అంటూ ప్రజలు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. పదేళ్లుగా రహదారులకు మరమ్మత్తులు చేపట్టక పోవడంతో గోతులమ యమయ్యాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలం లోని పాతతమేఘవరం నుంచి బోరుభద్ర, మరువాడ చిలక కూడలి నుంచి డి.మరువాడకు, కొల్లిపాడు నుంచి ఉదయపురానికి, లక్కివలస నుంచి గెద్దలపాడు పాలతలగాం కూడలి నుంచి తలగాం, కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ నుంచి నరసాపురం, బోరుభద్ర నుంచి ఉదయపురానికి సంతబొమ్మాళి నుంచి కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌కు, వనవిష్ణుపురం నుంచి ఉమిలాడ, జగన్నాథ పురం, పాతమేఘవరం నుంచి నౌపడకు వెళ్లే రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. వర్షం పడితే చాలు గోతుల్లో నీరు చేరిపోతుంది. దీంతో గొయ్యి ఏదో, రోడ్డు ఏదో తెలియక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో కనీసం రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మేఘవరం నుంచి సూరాడవానిపేట, టెంకూరు రోడ్డు మెటల్ వేసి మూడేళ్లు అవుతుంది. తారు రోడ్డు వేయకపోవడంతో రాళ్లు తేలిపోయాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

కొల్లిపాడు రోడ్డు గోతుల్లో చేరిన వర్షపునీరు

జీవామృతం ముద్దు

పాతపట్నం: జీవామృతం వ్యవసాయానికి ముద్దని మండల ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని సింగుపురంలో పొలంలో రైతులకు ఆదివారం ప్రకృతి వ్యవసాయ, ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి వేసిన మొదటి 15 రోజుల్లో ఐదు లీటర్ల జీవామృతాన్ని వంద లీటర్ల నీటిలో కలుపుకొని స్ప్రే చేసుకోవాలన్నారు. 30 రోజుల్లోగా పది లీటర్ల జీవామృతాన్ని 100 లీటర్ల నీటిలో కలుపుకొని స్ప్రే చేసుకోవాలన్నారు. 45 రోజులు గవదలు 15 లీటర్ల విజయ వామృతాన్ని వంద లీటర్ నీటిలో కలుపుకొని స్ప్రే చేసుకోవాలన్నారు. 60 రోజుల వ్యవధిలో 20 లీటర్ల జీవ అమృతాన్ని వంద లీటర్ల నీటిలో కలుపుకొని స్ప్రే చేసుకోవాలన్నారు. ఇలా ఈ విధంగా చేయడం వల్ల పంటకి ఎటువంటి ఎరువులు అవసరం లేదన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాధవి, పురుషోత్తం, ఇందులత, లక్ష్మి, జగన్, నారాయణరావు, మోహనరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ద్రవ జీవామృతంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మండల ఎఒ టి.భార్గవి అన్నారు. పొలంబడిలో భాగంగా మండలంలోని మశకపురంలో ద్రవ జీవామృతం, నీమాస్త్రం ఉపయోగాలపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. వాటి ఉపయోగాలు, తయారు చేసే విధానంపై వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం గుర్తించి అవగాహన కల్పించారు. ఎం.సంజీవరావు, మద్దిల చిట్టిబాబు, కె.కుమారి, రూప పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

ఆముదలవలస: పంటల్లో మేలైన సస్యరక్షణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చునని డిజిటల్ ఎల్ టు సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా రైతులతో వరి పంటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పాటించాల్సిన సూత్రాలను చేయించారు. ఈ సందర్భంగా డిజిటల్ యల్‌టు సురేష్ మాట్లాడుతూ పసుపు పూసిన జిగురు అట్టలను, పక్షి స్థావరాలను పొలంలో పెట్టించామని తెలిపారు. ఇవి పంటలో పెట్టడం వలన ప్రధానంగా పంటను ఆశించే దోమ ఉధృతిని తెలుసుకోవచ్చని, పక్షిస్థావరాల వలన వాటిపై పక్షులు చేరి అవి పంటకు హాని చేసే పురుగులను తింటాయని దీనివలన పంటలో కొంతవరకు పురుగులను నివారించగలమన్నారు. ఈ విధంగా ఎటువంటి ఖర్చు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లయితే పురుగులు, తెగుళ్ల ఉధృతిని సకాలంలో గుర్తించి వాటి నివారణకు అవసరమైన మేలైన సస్యరక్షణ పద్ధతులను చేపట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి, సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్, రైతులు సాంబమూర్తి, ఫల్గుణరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న ఎఒ భార్గవి

రమేష్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పివిఆర్

రమేష్ కుటుంబానికి పరామర్శ

లావేరు: మండలంలోని పోతయ్య వలసకు చెందిన కొంపెల్ల రమేష్ ఇటీవల హఠన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఉత్తరాంధ్ర తెలగ ఉద్యమ నేత పల్లంట్ల వెంకట రామారావు ఆదివారం రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. రమేష్ చిన్న వయసులోనే హఠన్మరణం చెందడం బాధాకరమన్నారు.

మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఆదివాసీలపై దాడులు ఆపాలి

పలాస: ఆదివాసీలపై దాడులను నిలిపివేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఆదివాసీ పోరాటాల సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మండలంలోని నీలావతిలో జిల్లా అధ్యక్షులు పత్తిరి దానేష్ అధ్యక్షతన ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక సూత్రాలను పాలకులు ఉల్లంఘిస్తున్నారని అన్నారు. ఆదివాసీ హక్కులను 56 షెడ్యూల్ ఆచరణలో అమలు చేయడం లేదని పేర్కొన్నారు. దేశంలో అనేక రూపాల్లో అన్ని రంగాలపై విధ్వంసం కొనసాగుతుందని అన్నారు. ఆదివాసీలు జీవించే హక్కు ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు జిల్లా బాధ్యులు ఈశ్వరమ్మ, అమరుల బంధు మిత్రుల సంఘం జోగి కోదండరావు, పౌర హక్కుల సంఘ సభ్యులు పూర్ణచంద్రరావు, కృష్ణ, జోగారావు, పోలరావు, వైకుంఠం, లక్ష్మణరావు, రామారావు, దానయ్య, వెంకటరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

టెక్కలి సిఐగా విజయ్‌కుమార్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విజయ్‌కుమార్, సిఐ

టెక్కలి నూతన సిఐగా ఎ.విజయ్ కుమార్ నియమి తులయ్యారు. టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో టౌన్, రూరల్ సిఐలుగా విధులు నిర్వహించిన పి.పైడయ్య, ఎస్.సూర్య చంద్రమౌళిలు విఆర్‌లో ఉన్నారు. వీరి స్థానంలో ఇటీవల టెక్కలి రూరల్ సిఐగా కె.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. తాజాగా టెక్కలి టౌన్ సిఐగా విజయ్ కుమార్ నియమి తులయ్యారు. దీంతో టెక్కలిలో మొత్తం ఇద్దరు సిఐలు, ఇద్దరు ఎస్ఐలు విధులు నిర్వహించనున్నారు.

మెమొంటోను అందజేస్తున్న భరద్వాజ్

ఘనంగా 'విఫర్‌యు' వార్షికోత్సవం

సోంపేట: సోంపేట మండల కేంద్రంలో విఫర్‌యు ఫౌండేషన్ 16వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం పూనా శ్రీకాంత్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం లాసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డి.ఎస్.వి.భరద్వాజ్, సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుల్ల రమేష్, మోహన్ పాల్గొని ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం మెమొంటోలను అందజేశారు.

రహదారి గోతులపై ఏర్పాటు చేసిన జెండాలు

రహదారి గోతులపై జెండాలు

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని ఆర్‌టిసి బస్‌స్టేషన్ ఎదురుగా అలికాం - బత్తిలి ప్రధాన రహదారిపై అడ్డంగా ఎర్రజెండాలు వెలిశాయి. ఈ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఇతర కారణాలతో భారీ గుంత ఏర్పడి నిత్యం వాహనాలు ఇరుక్కోవడం జరుగుతుంది. దీనిని గ్రహించిన రోడ్లు భవనాల శాఖ అధికారులు భారీ గుంతను గ్రావెల్ వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే ఆ గ్రావెల్ వేసిన ప్రాంతంలో తెలియని వాహన దారులు ప్రయాణం చేసి పలు వాహనాలు ఇరుక్కొని నానా ఇబ్బందులకు గురవుతూ వాహనాలు గుంతలో ఇరుక్కొని వాటిని బయటికి తీయటానికి జెసిబిలు ఉపయోగించి డ్రైవర్ల అష్ట కష్టాలు పడుతున్న దృశ్యాన్ని చూసిన స్థానిక ఆటో యూనియన్ సభ్యులు గ్రావెల్ వేసిన గుంతపై నుంచి వాహనాలు రాకపోకలు జరగకుండా డ్రైవర్లను అప్రమత్తం చేసేందుకు రోడ్డుకు అడ్డంగా ఎర్ర జెండాలు ఏర్పాటు చేశారు. దీంతో అలికాం - బత్తిలి ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే వాహన దారులు ఆ ప్రాంతానికి రాగానే ఎర్ర జెండాలను చూసి పక్కన ఉన్న ఆర్‌టిసి బస్‌స్టేషన్ రహదారిలో దానిని దాటుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

ఆపదలో స్నేహ హస్తం

కవిటి: తమతో పాటు 1997-98లో పదో తరగతి చదువుకున్న తోటి స్నేహితుడు తెంబూరు కుశరాజు మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు ఆ కుటుంబానికి స్నేహ హస్తం అందించారు. తమ స్నేహితుని భార్య గీత, కుమార్తె సరస్వతి పేరు మీదుగా పోస్టాఫీసులో రూ.50 వేలు ఫిక్సెడ్ డిపాజిట్ చేశారు. దానికి సంబంధించిన పత్రాలను ఆదివారం తమ స్నేహితుని భార్య, కుమార్తెకు అందించారు. కార్యక్రమంలో ఎస్.కామేష్, బి.శంకరం, ఎం.జగన్, జి.బాలకృష్ణ, డి.చిన్నయ్య, ఎ.ఉమాపతి, ఎస్.రవి, పి.వెంకటరావు, టి.నీలయ్య పాల్గొన్నారు.



డిపాజిట్ పత్రాలు అందిస్తున్న స్నేహితులు